సారస్వతసేవకుడు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

తన బావమరిది ఒక కథ రాసి ఒక సుప్రసిద్ధమాసపత్రికలో ప్రకటించేవరకూ గణపతి రచయితలను తనకు విజాతీయులుగా చేసేవాడు. వాళ్ళు ఏవిధంగానో తనకు భిన్నంగా ఉంటారని అతని దృఢవిశ్వాసం. ఏ రచయితతోనూ పరిచయం లేకపోవటంచేత గణపతి రచయితలను ఒక విధంగా ఊహించుకోవలసి వచ్చింది—వాళ్ళచేతుల్లో కలాలుంటవనీ, వాళ్ళముందు కాగితాలుంటవనీ, వాళ్ళ కళ్ళలో ఆలోచన లుంటవనీ! ఏ కవి నన్నా పలకరించి, "ఏమండీ?" అంటే, అతను తనవంక "ఎవడురా నువ్వు?" అన్నట్టు చూస్తాడని అతని కొక సంశయం ఉండేది.

కాని తన బావమరిదే ఒకరచయితగా పరిణమించే టప్పటికి, గణపతి పూర్వవిశ్వాసాలన్నీ తారుమారయినై. వెధవ! నాగాయికూడా ఒక రాతగాడా?

చిరకాలంనించీ వస్తున్న అభిప్రాయాలను మార్చుకోవటం ఎవరికైనా కష్టమే కదా! తన బావమరిది కథను ఆ పత్రికవాళ్లు పొరపాటున వేసుకున్నారేమో ననుకున్నాడు గణపతి మొదట్లో. ఆ కథ చదివిన మీదట ఆ అభిప్రాయం తాత్కాలికంగా బలపడింది. తను వెనక చదివిన కథల్లో వచ్చే పాత్రలు నిజంగా ఎక్కడో ఉన్నట్టూ, వాళ్లు నిజంగా అట్లా ప్రవర్తించినట్టూ, అట్లా సంభాషించినట్టూ నమ్మ బుద్ధి అయేది. కాని ఈ కథ అట్లా లేదు. ఎవరో శ్రీనివాసరావుట! సీతను ప్రేమించాడుట! అన్నీ వట్టిదే! వెధవ కల్పన—అట్లా ఎక్కడా జరగదు. అసలు శ్రీనివాసరావు లేడూ! సీతా లేదూ! ఉంటే తనకు తెలియదా ఏమిటీ?

ఈ ఆలోచన వెంటే మరొక ఆలోచనకూడా వచ్చింది—ఏం? మనం మటుకు కథ లెందుకు రాయకూడదూ? వెధవ, నాగాయే రాసినప్పుడూ!

ఇప్పు డాలోచించితే రచన తనకు విజాతీయంగా ఉన్నట్టు కనిపించ లేదు. ఎందుచేతనంటే నాగాయికి వచ్చినంత తెలుగు—కావలిస్తే ఇంకా అంతకంటె ఎక్కువ తెలుగు!—తనకూ వచ్చు. నాగాయి తన మాదిరిగా స్కూలుఫైనలుతో ఆగలేదనుకో! అయితే ఏం? కాలేజీలో వాడు నేర్చిపడిచిన తెలుగేముందీ? (ఇంకా తాను స్కూలులో తెలుగు విద్యార్థి. నాగాయి ఇంకా సైన్సు వెధవ! కథలు రాయటం కాలేజీలో చెప్పరుకదా?

తనకు ఇంతకాలం నించీ తెలియదుగాని కథలు రాయటం తనకూ చాతనయే ఉండాలి !

ఆ సాయంకాలమే ఒక కానీ ఊదారంగు సీరాబిళ్ళలూ, ఒక కలమూ, ఒక దస్తా కాగితాలూ తెచ్చి ఆ రాత్రి కథ రాయటానికి కూర్చున్నాడు.

ముందు కథకు పేరు ఒకటి ఉండాలని అందరికీ తెలిసిన విషయమే. ఆ పేరు కుదిరితే కాని కథ కుదరదు. కథ పేరేమిటో నిర్ణయించుకోకపోతే కథ యేమిటో ఎట్లా తెలుస్తుంది?

తను కూడా ప్రేమవిషయిక మైన కథే రాతా మనుకొన్నాడు గణపతి. అస లంతకంటె కథ రాయటానికి విషయం ఏముంటుందీ? నాయకీ, నాయకుడూ! వాళ్లున్న తరువాత ప్రేమించుకోక పోట్లాడుకుంటే ఏంబాగుంటుందీ? కథలు రాసేవాళ్లంతా ప్రేమకథలే రాస్తారు. నాగాయి చూడరాదూ? కాశీమజలీలు చూడరాదూ? "ప్రేమబంధం" అంటే బాగానే వుంటుంది కాని నాగాయి ఆ పేరు అదివరకే కొట్టేశాడు, వెధవ! తనకు కథ రాయాలనే ఆలోచన నెల క్రితమే వచ్చివుంటేనా? .....

"ప్రేమ—?" ప్రేమతో కలిసే చక్కనిమాట ఉండదూ? "ప్రేమమహిమ" అంటే బాగుండదూ?

కాగితం పైభాగంలో "శ్రీ రామా నీవే కలవు" అనిరాసి, దానికింద "ప్రేమమహిమ" అనిరాసి, దానికింద చిన్న శేషశాయివంటి అలంకారం ఒకటి పెట్టాడు గణపతి. ఆ తరువాత తను రాయబూనిన కథ యొక్క "ప్లాటును" గురించి ఆలోచించ సాగాడు.

కథలకు "ప్లాటు" కుదురటమే కష్టమనీ, అది దొరకకనే చాలామంది సుప్రసిద్ధ కథకులు చాలా బాధపడతారనీ గణపతి విని ఉన్నాడు. కాని తీరా ఆలోచిస్తే కథకు ప్లాటు కుదరటం ఏమీ కష్టం కాదని తేలిపోతుంది. ఎందుచేతనంటే తన బుర్రలో ఒక చక్కని ప్లాటు అదివరకే సిద్ధంగా ఉంది—వివరాలతో సహా!

అమితమైన ఉత్సాహంతో గణపతి కథారచన ప్రారంభించాడు. కాలం ఎట్లా వెళ్లుచున్నదో అతనికి తెలియలేదు. గడియారం పన్నెండు కొట్టింది. గణపతి రెండవ అరటావు సహానికి వచ్చాడు. గడియారం అతన్ని ఒక నిద్రలో నించి లేపినట్లయింది. అతని తల యావత్తూ సెగలు వెళ్లుతున్నట్టున్నది. కలం గట్టిగా పట్టుకోవటం వల్ల వేళ్లు నొచ్చుతున్నై. వాటికి సీరా కూడా అంటింది.

గణపతి తృప్తితో ఒక్క నిట్టూర్పు విడిచాడు. రచనలో ఇంతగా మునిగిపోగల రచయితలు ఎంతమంది యున్నారు? తన నాయికా నాయకుల ప్రణయానికి తన హృదయం కరిగిపోతున్నది. వాళ్లు అనే మాటలు తన చెవులలో ప్రతిధ్వనించు తున్నై.— ముఖ్యంగా నాయిక "నాథా, నన్ను నమ్మవా?" అన్న ముక్క! ఇంకొక నిట్టూర్పు విడిచి గణపతి రాసినదంతా ఒక్కసారి తిరిగి చూసుకున్నాడు. అతని గుండె ఆగిపోయినట్టయింది. ఏదో పొరపాటు జరిగింది, చూడటానికే సరిగా లేదు. వెంటనే తట్టింది జరిగిన పొరపాటేమిటో— తన రచనలో పేరాలు లేవు! అవును మరి రచనలో పేరాలు లేకుండా ఎట్లా? నాలుగైదు వాక్యాలకు ఒక పేరా చెయ్యకపోతే చూడటానికి ఎంత అందవికారంగా ఉంటుందీ? ఇంకా నయం—తనకు వెంటనే తట్టింది కనక సరిపోయింది. లేకపోతే ఆ పత్రికవాళ్లు పేరాలు లేకుండా తన కథ ప్రకటిస్తే నాగాయి ఎంత ఎగతాళి చేసేవాడు!

ఇప్పుడు మళ్ళీ కథ యావత్తూ తిరగరాయటం అసంభవం. నాలుగైదుచోట్ల పేరాల కోసం గుర్తులు పెడదా మని కథ రాసినంతవరకు మళ్ళా చదవటానికి సంకల్పించు కున్నాడు.

అప్పుడు తెలుసుకున్నాడు గణపతి— తను కూడా నాయకుడికి శ్రీనివాసరావనీ, నాయికకు సీత అనీ నామకరణం చేశాడు! కూడనిపని! కొంచెం సేపు ఆలోచించిన మీదట గణపతికి తట్టింది. పాత్రలకు పేర్లు పెట్టటం కూడా యాతన పనే నని. ఎందు కంటే, ఎంతసేపు ఆలోచించినా శ్రీనివాసరావు వంటి మంచి మగపేరు, సీతవంటి మంచి ఆడపేరు, కనిపించవు గణపతికి, అదేం ప్రారబ్ధమో!

పిశ్వప్రయత్నం చెయ్యగా సీతారామారావూ కమలా అనే పేర్లు దొరికినై గణపతికి. ఆ కమల అన్న పేరు చాలా ముద్దుగా ఉంది నిజంగా. (కొత్తగా కథలు రాసే వాళ్లు తప్పక "కమల" అనే పేరు వాడితీరాలి! ఆటే చూస్తున్నాను.)

పాతపేర్లు కొట్టేసి కొత్తపేర్లు ఇరికించి రాత్రి మూడుగంటలు కొట్టే టప్పటికి గణపతి ఎట్లా గయితే ఏం కథ పూర్తి చేశాడు.

అతనికి కలిగిన తృప్తి వర్ణనాతీతం. అతని కింకా నిద్ర రావటం లేదు. తను పూర్తిచేసిన కథలోని సంఘటనలు అతని బుర్రలో ఇంకా పరిభ్రమిస్తున్నై. ఆ పాత్రలు అతని హృదయంచుట్టూ మూగి దాన్ని మథించుతున్నై. తను రాసిన కథ నిజంగా జరిగి ఉండినా అతనికి అంత ఆవేదన కలిగిఉండేదికాదు.

ఇంతకూ ఆ కథ ఎవరికైనా చదివి వినిపించాలి. తన అన్న రాసిన కథకు భార్యా మురిసిపోవటం చూసి నప్పటి నించీ గణపతికి అమిత అసూయగా ఉండింది. గణపతి

భార్యను లేపి "ఒసేవ్ ! నేను కూడా కథ రాశానే !" అన్నాడు. అతని భార్య నిద్ర మత్తున" "సరే లెండి !" అని మళ్ళా నిద్రపోయింది.

గణపతికి మండిపోయింది. తన అన్న కథ రాస్తే అంత మురిపెమూ, తను రాస్తే "సరేనా ?" గణపతి భార్యను లేచేదాకా లేపి బలవంతాన మంచంమీద కూర్చోపెట్టి కథ చదవసాగాడు. ఆవిడ నిద్రాభంగ మయినందుకు విసుక్కుంటూ, తెరవుడు పడని కళ్ళతో భర్తవంక చూసి, "ఇంతలో ఏం మునిగిపోయిందండీ ? రేపు మధ్యాన్నం చదవకూడదూ ?" అంది. రేపు మధ్యాన్నం ! తెల్లవారిలేచికూడా కాదు !

గణపతి తన కథ చదువుకుపోయినాడు. కాస్సేపు గణపతిభార్య మంచంమీద జోగుతూ కూర్చొని ఆఖరుకు "ఇది మా అన్నయ్య రాసిన కథేగా !" అని బోర్ల పడుకుని మళ్ళీ నిద్రపోయింది.

అప్పటిదాకా గణపతికి స్ఫురించలేదు— తను ఇంతా కష్టపడి తిరగరాసింది నాగాయి రాసిన కథే !......

రచయిత కావాలని ఒకసారి కలిగిన సంకల్పం గణపతి హృదయంలో అట్లాగే ఉండిపోయింది. అప్పుడు వెలిగించబడిన ఆశాదీపం ఈ మాత్రపు గాలికి ఆరిపోలేదు. కథకుడు కావాలని గణపతి చాలా ప్రయత్నాలు చేశాడు. కొన్నికథలు రాసి అనేక పత్రికలకు పంపాడు. కాని వాటి సంగతి ఏమయిందో తెలియదు. నాగాయి కథ వేసుకోవటానికి పాల్పడ్డ పత్రికకు కూడా తన కథ అవసరం లేకపోయింది! అదే చిత్రం!

ఇంతలో వాళ్ళ వూళ్లో ఒక సారస్వత సమాజం వెలిసింది. అందులో చాలా చదువు కున్నవాళ్లు సభ్యులుగా చేరారు. వాళ్ళందరూ తనకు ఆప్తు లల్లే కనిపించారు గొప్ప రచయిత అవుదా మని ప్రయత్నిస్తున్న గణపతి ప్రాణానికి! రచన తాలూకు సులువులూ మెళుకువలూ తెలుస్తవని, గణపతి వారందరితోనూ పరిచయం కలిగించుకుని, వారి కాఫీ సిగరెట్టు ఖర్చులు సయితం తనే చాలావరకు భరించటం నేర్చుకున్నాడు. అతను కూడా రాయాలని ప్రయత్నిస్తున్నట్టూ, అతని రచనలను ఎవరూ ఆదరించనట్టూ తెలిసిన మీదట, సమాజం అధ్యక్షుడు అతన్ని కూడా సమాజంలో చేర్చుకుని, అతనికి రచన విషయమై అమితమైన ప్రోత్సాహం ఇచ్చాడు.

"కొంత పాండిత్యమూ, భాషా పరిచయమూ ఉంటే రచన జోరుగా సాగుతుంది!" అన్నాడు అధ్యక్షుడు.

కాలం గడిచింది. గణపతి దీక్షతో తెలుగూ, సంస్కృతమూ, హిందీ, బెంగాలీ మొదలయిన భాషలలో కృషి చేశాడు. అప్పటికీ అతనికి మాతృభాషలో—నానుక భాషలో—వ్యాసం కుదరక పోవటం చూసి, అధ్యక్షుడు, "అన్నగారికి కల్పన తక్కువ. హిందీ బెంగాలీ భాషల్లో చక్కని గ్రంథరాజా లున్నవి. అన్నగారు వాటిని తర్జుమా చెయ్యరాదూ?" అని సలహా ఇచ్చాడు.

ఆ సలహామీద గణపతి ఒక బెంగాలీనవలా, ఒక హిందీనాటకము, నాలుగైదు పాశ్చాత్య కథలూ (హిందీలోకి అదివరకే తర్జుమా అయినవి), తెలుగులో కొన్ని భావగీతాలు, రచించి అచ్చువేయించ గలిగాడు. ఇవన్నీ అధ్యక్షులవారిచేత సంస్కరించబడినవి. (గిట్టనివాళ్లు, గణపతి రాసిన పద్యాలలో, గణపతి రాసిన పదాలులేవని కూడా అంటారు.)

ఈ గ్రంథాలన్నీ గణపతి స్వంత డబ్బుతో సమాజ ప్రచురణాల కింద అచ్చువేసినవి. అవి సమాజ సభ్యులలో కొంతమందికి అంకితం ఇవ్వబడి మిగిలినవారు రాసిన పరిచయాలతో కూడుకున్నవి. సమాజ సభ్యుల ఇతర రచనలు కొన్ని గణపతికి అంకితం అయినై.

సమాజంవల్ల గణపతికి ఇంకా చాలా పేరు వచ్చింది. అతని పేరు దేశమంతటా ప్రచారం అయింది. గణపతి ఏమిరాశాడో, ఎందుకు రాశాడో తెలియని వారికి కూడా అతను పెద్ద సారస్వతసేవకు డని తెలుసు. అతని పేరు తెలియని రచయిత దేశంలో ఎవడన్నా ఉన్నాడనుకోను. కొత్తగా రచన చెయ్యాలని సంకల్పించుచున్న యువకులు గణపతి ఆశీర్వాదం తీసుకుంటారు. ఏ సాహిత్య సమ్మేళనమూ అతను రాకపోతే చిన్నబోతుంది.

"గణపతిగారు వస్తున్నారా?" అని అందరూ ఆతుర్దాగా అడుగుతారు. కారణాంతరాలవల్ల గణపతిగారు రావటం పడలేదు!

"గణపతిగారు రాలేదట!"

"అయ్యో, ఏమండీ?"

"గణపతిగారు రాలేదట!"

"నిజంగానా?"

"విన్నారా? గణపతిగారికి రావటానికి పడలేదట!"

కవులంతా దిగులుగా ఈ విషయం చెప్పుకుంటారు. కవి సమ్మేళనం కళాహీనమై పోతుంది!